దిగుబడి దిగదుడుపే..

- జీడి మామిడిని దెబ్బతీసిన తెగుళ్లు
- భారీగా తగ్గిన దిగుబడులు
- ధర బాగున్నా గిట్టుబాటు కాని వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు


లోవ కొత్తూరులో సాగవుతున్న జీడిమామిడి తోటలు

తుని రూరల్: ఆరుగాలం కష్టపడినా ఆశించిన స్థాయిలో ఫలసాయం దక్కకపోవడంతో జీడిమామిడి రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఈ సంవత్సరం గిట్టుబాటు ధర బాగుందన్న రైతుల సంతోషం దిగుబడుల రూపంలో ఆవిరైపోతోంది. దీంతో దిగుబడుల దిగతుడుపే అన్నట్టుగా ఉందని రైతులు వాపోతున్నారు. ఏడాదికి ఒకసారి ఫలసాయం లభిస్తే ఆదాయం కనిపిస్తుందన్న నమ్మకంతో వేలాది మంది మెట్ట ప్రాంత రైతులు జీడిమామిడి సాగు చేస్తున్నారు. నెల రోజుల నుంచి జీడి గింజల దిగుబడులు లభిస్తున్నాయి. రైతుల నుంచి వ్యాపారులు 80 కిలోల బస్తా రూ.11 వేల నుంచి రూ.11500కు కొనుగోలు చేస్తున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా గిట్టుబాటు ధర పలుకుతుండడానికి ప్రధాన కారణం దిగుబడులు లేకపోవడమేనని రైతులు, కొనుగోలుదారులు పేర్కొన్నారు. సాధారణంగా ఎకరాకు ఎనిమిది నుంచి పది బస్తాలు దిగుబడి లభించాల్సి ఉండగా ఈ సంవత్సరం మూడు నుంచి నాలుగు బస్తాలు లభించడం కష్టమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎరువులు, పురుగు మందులు, నీటి తడులు, పంటకాలంలో కాపలాకు పెట్టిన పెట్టుబడులు రావడం లేదని, దిగుబడులు దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోయారు.

8960 ఎకరాల్లో జీడిమామిడి సాగు

తుని నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో 8960 ఎకరాల్లో జీడి మామిడి తోటలు సాగవుతున్నాయి. తుని మండలంలో 17 గ్రామాలు, తొండంగి మండలంలో ఎనిమిది గ్రామాలు, కోటనందూరు మండలంలో 15 గ్రామాల్లో 6353 మంది రైతులు మెరక, మెట్ట భూముల్లో జీడిమామిడి సాగు చేస్తున్నారు. వాతావరణ మార్పులు, తెగుళ్ల ప్రభావంతో దిగుబడులు తగ్గాయని అధికారులు తెలిపారు. రెండేళ్లకు ఒకసారి కొన్ని చెట్లు పూత పూసి కాపు కాస్తాయని, ఆ విధంగా ఈ సంవత్సరం 50 శాతం పూత, గింజలు వచ్చాయని చెప్పారు.

పెరిగిన డిమాండ్

దిగుబడులు తగ్గడం, వినియోగం పెరగడంతో పాటు మెట్ట ప్రాంతంలో పండిన జీడిగింజలలో పప్పు పరిమాణం, నాణ్యత, రుచి ఎక్కువగా ఉండడంతో డిమాండ్ పెరిగింది. 2024 సీజన్‌లో ప్రారంభ ధర రూ.పది వేలు ఉండగా క్రమంగా రూ.ఎనిమిది వేలు వద్ద క్రయవిక్రయాలు జరిగాయి. ఈ సంవత్సరం ప్రారంభ ధర రూ.10 వేలు ఉండగా రెండు వారాలకే 80 కిలోల బస్తా జీడి గింజలు రూ.11 వేలు నుంచి రూ.11500లకు క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. మే చివరి వరకూ ఇదేవిధంగా జీడి గింజల ధరలు కొనసాగుతాయని వ్యాపారులు తెలిపారు. ఇతర దేశాల నుంచి జీడి గింజలు దిగుమతి అయితే ధర తగ్గే అవకాశాలు ఉన్నాయి.


కొట్టాంలో జీడిగింజలను ఆరబెడుతున్న రైతులు


తుని మండలం సీతయ్యపేటలో మంచుప్రభావంతో మాడిపోయిన పూత

నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం, రైతుల సంఖ్య

మండలం	గ్రామాల సంఖ్య	రైతుల సంఖ్య	సాగు విస్తీర్ణం
తుని	17	2559	3410
కోటనందూరు	15	3103	3561
తొండంగి	8	691	1989
మొత్తం	40	6353	8960

దిగుబడి తగ్గింది

మా కుటుంబానికి రెండున్నర ఎకరాలు జీడిమామిడి తోట ఉంది. గతేడాది 15 బస్తాలు దిగుబడి వచ్చింది. ఈ సంవత్సరం పూత, పిందెలు సరిగా రాలేదు. మంచు, తెగుళ్లతో కొంతమేరకు పూత, పిందెలు మాడిపోయాయి. దీనిప్రభావంతో దిగుబడి తగ్గిపోయింది. ఇప్పటికీ ఐదు బస్తాలు దిగుబడి వచ్చింది. మరో రెండు బస్తాలు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

– **కె.అప్పలనాయుడు**, ఎస్ఎస్‌పీ నగరం

గిట్టుబాటు ధరకు విక్రయించాలి

మార్కెట్‌లో దేశవాళీ జీడిపప్పుకు మంచి డిమాండ్ ఉంది. ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధరకే రైతులు జీడి గింజలను విక్రయించండి. దళారుల మాటలకు మోసపోవద్దు. పంటకాలం ముగిసిన తర్వాత దుక్కులు చేసి, సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. దీనివల్ల వచ్చే సంవత్సరం విస్తారంగా పూత, పిందెలు వచ్చి మంచి దిగుబడులు వస్తాయి.

– **జి.విజయలక్ష్మి**, ఉద్యాన అధికారి, తుని

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా 'రాజాల'


రాజాల చిట్టిబాబు

ప్రత్తిపాడు: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో శనివారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజాల చిట్టిబాబు రెండో సారి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో చిట్టిబాబుకు 44 ఓట్లు రాగా ప్రత్యర్థి రవణం వెంకట్రావుకు 27 ఓట్లు లభించాయి. 17 ఓట్ల ఆధిక్యతతో రాజాల చిట్టిబాబు గెలుపొందారు. బార్ ఉపాధ్యక్షుడిగా కె. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా సోము గౌరీశంకర్, సంయుక్త కార్యదర్శిగా గెద్దం కామేశ్వరరావు, కోశాధికారిగా పలివెల నాగేంద్రరాజు, స్పోర్ట్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా మంచికంటి శ్రీనివాస భారతి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా వేగి భద్రం గెలుపొందారు. ఎన్నికల అధికారులుగా సీనియర్ న్యాయవాదులు మళ్ళ గంగాధర్, పిల్లి బలరాముడు, బాదా జాన్‌బాబు, బత్తుల రవికుమార్, రాయి అత్యుతరామారావులు వ్యవహరించారు.

విద్యార్థుల నమోదుపై సమీక్ష

గండేపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల నమోదుపై ఎంపీడీఓ నాతి బుజ్జి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం, ప్రభుత్వ పాఠశాలల్లో గల విద్యార్థులను తదుపరి తరగతులకు తరలించడం తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్, వివిధశాఖల సిబ్బందికి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కిర్లంపూడి: పోషకాహారంతోనే తల్లీబిడ్డలకు సంపూర్ణం ఆరోగ్యం లభిస్తుందని సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత అన్నారు. పోషణ్ పఖ్వాడ్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ జగ్గంపేట సీడీపీఓ ఎం.పూర్ణిమ అధ్యక్షతన స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం పోషకాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పూర్ణిమ మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పిల్లల బరువును ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. వయసుకు తగ్గా బరువు లేకపోయినా... ఉండాల్సిన బరువుకన్నా ఎక్కువ ఉన్నా వెంటనే న్యూట్రీషన్ రిహాబీటేషన్ సెంటర్‌కు పంపించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన పిండి వంటలు తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం 12 మంది గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. ఎంఈఓ టీ.జోసెఫ్, సూపర్‌వైజర్లు జి.సునీత, పి.బూసమ్మ, షేక్ కరిమున్నీషా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ


ఏలేశ్వరంలో తెలుగు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

ఏలేశ్వరం: శ్రీవిశ్వావసు నామసంవత్సరాన్ని పురస్కరించుకుని పట్టణంలో శనివారం నూతన తెలుగు క్యాలెండర్‌ను అవిష్కరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఉపాధ్యక్షుడు దవులూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో రూపొందించిన క్యాలెండర్‌ను మున్సిపల్ కమిషనర్ ఎం.సత్యనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీఓ ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం గణపతిరావు, ఉపాధ్యాయులు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

22న మండల సమావేశం

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 22న మండల సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్టు చెప్పారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

ఏలేశ్వరం: వేసవి ఎండలకు విద్యుత్ వినియోగం పెరగడంతో పట్టణంలో కరెంట్ సమస్యలు తలెత్తుతున్నాయి. స్థానిక 19వ వార్డులో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో ట్రాన్స్‌కో ఏఈ సూర్యనారాయణ చొరవతో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఏర్పాటు చేశారు. దీంతో విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతాయని ఏఈ తెలిపారు. కార్యక్రమంలో శంకాని బాబ్జీ, ట్రాన్స్ కో సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రేషన్ షాపులు సీజ్


జగ్గంపేటలో ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న అధికారులు

జగ్గంపేట: గ్రామంలోని రెండు రేషన్ షాపులను అధికారులు సీజ్ చేశారు. డీలర్లు, రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనదారులు రేషన్ బియ్యం ఇవ్వకుండా లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు ఆరోపణలు వచ్చాయి. దీనిపై శనివారం అధికారులు విచారణ చేశారు. జగ్గంపేట తహసీల్దార్ జేవీఆర్ రమేష్ ఆధ్వర్యంలో జగ్గంపేట, ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాలకు చెందిన ఎంఎస్‌ఓలు జగ్గంపేటలోని 7 రేషన్ షాపులు, రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనాలను తనిఖీలు చేసి స్టాక్ వెరిఫికేషన్ చేశారు. 2, 5 నంబర్ల షాపుల్లో స్టాక్‌లో తేడాలు గుర్తించి సీజ్ చేశారు. నిందితులపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు తహసీల్దార్ రమేష్ తెలిపారు. సీజ్ చేసిన షాపులకు వేరే ఇన్‌చార్జీలను నియిమించి వారి ద్వారా రేషన్ పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ బియ్యం పంపిణీ చేసే 4వ నంబర్ వాహనంపై పలు ఆరోపణలు వచ్చాయని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముద్రగడను కలసిన తోట నరసింహం


కిర్లంపూడిలో ముద్రగడను మర్యాదపూర్వకంగా కలిసిన తోట నరసింహం

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ ముద్రగడ పద్మనాభాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట కో ఆర్డినేటర్ తోట నరసింహం కిర్లంపూడిలోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాలసిన పలు అంశాలపై చర్చించారు. వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, యువనాయకుడు తోట రాంజీ, రామకుర్తి రామచంద్రమూర్తి, అడారి మహేష్, పెనగంటి రాజేష్, వేగి సాంబశివ, మాకా వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి కొండంత బలం


కిర్లంపూడిలో ముద్రగడ గిరిబాబును కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: కార్యకర్తలే పార్టీకి కొండంత బలమని, పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పార్టీ ఉన్నత స్థానం కల్పిస్తుందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ప్రత్తిపాడు మండలంలోని చింతలూరు, శరభవరం, ఏలేశ్వరం, అప్పన్నపాలెం, తిరుమాలి గ్రామాలకు చెందిన పలువురికి పార్టీ పదవులు దక్కాయి. దీంతో శనివారం కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ పార్టీ విజయానికి శక్తి వంచనలేకుండా కృషి చేయాలని సూచించారు.

విద్యార్థులకు రూ.20 వేల ప్రోత్సాహం


విద్యార్థి విజయ్‌కుమార్‌కు ప్రోత్సాహం అందిస్తున్న కంబాల శ్రీనివాస్‌రావు

గోకవరం: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నేత కంబాల శ్రీనివాస్‌రావు శనివారం రూ.20 వేలు ప్రోత్సాహం అందజేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 979 మార్కులు సాధించి కళాశాల ప్రథమ స్థానంలో నిలిచిన బైపీసీ విద్యార్థి కొతూరి విజయకుమార్, ఇంటర్ మొదటి సంవత్సరంలో 456 మార్కులు సాధించిన ఎంపీసీ విద్యార్ధిని నందూరి నాగసూర్యచక్రకు ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున అందజేసి శాలువాతో సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ కె.సుధాకర్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర, నాయకులు దాసరి ధర్మరాజు, బత్తుల నానాజీ, పసల గణేష్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


కాట్రావులపల్లిలో స్వామివారి కల్యాణంలో పాల్గొన్న దంపతులు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లిలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం జరిపించారు. పానుగంటి లక్ష్మి వెంకయ్యమ్మ ధర్మసత్రం, వెంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ ఎం.రాంబాబురెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామివారి అలంకరణ భక్తులకు కనువిందు చేసింది. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి కల్యాణం వందలాది మంది దంపతులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థి ప్రతిభ

శంఖవరం: మండలంలోని కత్తిపూడి గ్రామానికి చెందిన గౌతు పూర్ణ అఖిలేష్ నాగ సాయి జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో ప్రతిభ చూపాడు. శుక్రవారం రాత్రి కేంద్ర విద్యాశాఖ ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 1911 ర్యాంక్ సాధించినట్లు అతని తండ్రి గౌతు సత్యనారాయణ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థి అఖిలేష్ నాగ సాయిని తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

డ్రోన్ వినియోగంపై అవగాహన


ఏవీ నగరంలో డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తొండంగి: మండలంలోని ఏవీ నగరంలో రైతులకు డ్రోన్ సాయంతో మందుల పిచికారీపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది డ్రోన్‌లో మందులను ఏవిధంగా లోడింగ్ చేయాలి, వ్యవసాయంలో డ్రోన్ వినియోగం తదితర అంశాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ప్రస్తుతం కూలీల కొరత సమస్య డ్రోన్‌ల ద్వారా తీరుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ఎస్.నరసింహం, గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

రౌతులపూడి: మండలంలోని శృంగవరం శివారున రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.5,400, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

సారాతో మహిళ అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఏలేశ్వరం మండలం తిరుమాలిలో శనివారం పది లీటర్ల సారాతో మహిళను అరెస్టు చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి. శివప్రసాద్ తెలిపారు. తిరుమాలిలో సారా విక్రేతలపై దాడులు నిర్వహించగా అంచూరి నూకరత్నంను అదుపులోకి తీసుకుని, ఆమె నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ చైత్ర మాసోత్సవాలు ప్రారంభం


కనకదుర్గ అమ్మవారి ఆలయంలో లక్ష కుంకుమార్చన చేస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి చైత్రమాస జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారి ఆలయంలో పండితులు కలశస్థాపన, మండపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు రుత్విక్కులకు దీక్షా వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం రుత్విక్కులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. 11 గంటలకు అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ నెల 27న చైత్ర అమావాస్య వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు అమ్మవారికి లక్ష కుంకుమార్చన, రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు గరగల సంబరం నిర్వహిస్తామని వివరించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరబట్ల గంగబాబు, యనమండ్ర శర్మ, ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్శింహమూర్తి, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, పురోహితులు పాలంకి పట్టాభి, అర్చకులు చిట్టెం హరగోపాల్, దత్తాత్రేయశర్మ పాల్గొన్నారు.

ప్రజా దర్బారుకు సమస్యల వెల్లువ


డి.పోలవరం ప్రజా దర్బారులో అర్జీలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తుని రూరల్: మండలంలోని డి.పోలవరంలో శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య నిర్వహించిన ప్రజా దర్బారుకు సమస్యలు వెల్లువెత్తాయి. పింఛన్లు, దివ్యాంగ సర్టిఫికెట్లు, రెవెన్యూ, పాఠశాలలో క్రీడ ప్రాంగణం ఏర్పాటు తదితర సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. కొన్ని సమస్యలపై తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ సాయి నవీన్, ఇతర అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. నిర్దిష్ట సమయంలో సమస్యల పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలు పరిష్కారానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే దివ్య పేర్కొన్నారు. తొలుత రాయితీ పవర్ టిల్లర్‌లను రైతులకు అందజేశారు. చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించి, వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. మూడో శనివారం కావడంతో డిప్యూటీ ఎంపీడీఓ జి.మరిడియ్య ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత దివస్ ప్రతిజ్ఞలో ఆమె పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా రన్ ఫర్ జీసస్ ర్యాలీ


జగ్గంపేటలో రన్‌ఫర్ జీసస్ ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

జగ్గంపేట: మండల పాస్టర్స్ ఫెలోషిఫ్ ఆధ్వర్యంలో జగ్గంపేటలో శనివారం రన్ ఫర్ జీసెస్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర నేత, పాస్టర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఏసుక్రీస్తు 2025 సంవత్సరాల క్రితం ఈ లోకంలో జన్మించి, మానవుల కోసం రక్తాన్ని చిందించిన రోజును గుడ్ ఫ్రైడేగా, ఆయన మరణించిన 3వ రోజును ఈస్టర్‌గా జరపుకుంటామని తెలిపారు. దీనిలో భాగంగా క్రైస్తువుల ఐక్యత చాటడానికి రన్‌ఫర్ జీసెస్ నిర్వహించామని వివరించారు. కార్యక్రమంలో మండలలోని పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

తునిలో శాంతి ర్యాలీ

తుని: ప్రపంచ శాంతిని కోరుతూ రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని తుని యునైటెడ్ పాస్టర్స్ ఫెల్లో షిప్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం నుంచి బయలుదేరి గొల్ల అప్పారావు సెంటర్, రాజా కళాశాల మీదుగా రాజా కళాశాల మైదానం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ ప్రపంచ శాంతికి కృషి చేయాలని ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధి వేప చేదు ప్రసాద్ బాబు కోరారు. దైవ సేవకులు బి.థామస్, కె.కిశోర్, చార్లెస్ పిన్ని, సతీష్, జీన్స్, పరంజ్యోతి, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాలల వార్షికోత్సవాలు

గండేపల్లి: స్థానిక సింగరంపాలెం వెళ్లే మార్గంలో ఉన్న శ్రీగీతం ఇంగ్లిష్ మీడియం స్కూల్ 29వ వార్షికోత్సవాన్ని స్కూల్ కరస్పాండెంట్ వీఎస్పీ చౌదరి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. మురారి అమ్మవారి జాతరకు వెళ్లే మార్గంలో గల హిమజ శ్రీవాణి ఇంగ్లిష్ మీడియం మొదటి వార్షికోత్సవం స్కూల్ కరస్పాండెంట్ తొండాపు కుబేర్ చక్రవర్తి ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగింది. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలతో అలరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పరిమి బాబు, మురారి ఉపసర్పంచ్ జాస్తి వసంత్, సుంకవల్లి రమేష్ తదితరుల చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రక్తదాతలు ప్రాణదాతలతో సమానం

ప్రత్తిపాడు: రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ కాంతి సుధాకర్ ప్రారంభించారు. ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంఈఓ వి. రాజబాబు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, రెవెన్యూ ఉద్యోగులు, వివిధ గ్రామాల ప్రజలు సుమారు 60 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు ఎంపీడీఓ, తహసీల్దార్‌లు ప్రసంసాపత్రాలను అందజేశారు. ఈఓపీఆర్డీ కేవీవీఎస్ కాశీవిశ్వనాథం, ఏపీఓ కుమారస్వామి, డిప్యూటీ తహసీల్దార్ కె. పుణ్యవతి, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, సర్పంచ్ గోనగాల అప్పలరాజు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల కొండలరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన

తుని: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. స్థానిక గరల్స్ హైస్కూల్లో వికాస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను ఎమ్మెల్యే దివ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివ్య మాట్లాడుతూ నిరుద్యోగ యువత కలలు కని వాటిని సాకారం చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ జాబ్‌మేళాలో 205 మంది నిరుద్యోగ యువతకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, యనమల రాజేష్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ గంట్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమేవ జయతే..

- పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం
- గ్రామాల్లో జోరుగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీ
- పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన


కిర్లంపూడిలో ర్యాలీ చేస్తున్న అధికారులు


రౌతులపూడిలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్‌పై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

రౌతులపూడి/జగ్గంపేట/కిర్లంపూడి/గండేపల్లి/తొండంగి/గోకవరం: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. రౌతులపూడిలో ఎంపీడీఓ బి.శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో అధికారులు మండల పరిషత్ కార్యాలయం నుంచి పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ చేపట్టారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, ఆరోగ్యవంతమైన వాతావరణానికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, వెలుగు సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. జగ్గంపేటలో జిల్లా పంచాయతీ కార్యాలయ ఏవో ఎస్.సుబ్బారావు ఆధ్వర్యాన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. పలు శాఖల అధికారులు ఎలక్ట్రానిక్ వస్తువులు రిపేరు చేసే దుకాణాల నుంచి ఈ-వేస్టేజిను సేకరించారు. జగ్గంపేట ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ జేవీఆర్ రమేష్, ఈవోపీఆర్‌డీ భాస్కరరావు పాల్గొన్నారు. కిర్లంపూడిలో ఎస్సై జి.సతీష్ సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. ఎంపీడీఓ హరికృష్ణ ఆధ్వర్యంలో వ్యర్థాల సేకరణ, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు రీసైక్లింగ్‌పై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు. గండేపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఎంపీడీఓ నాతి బుజ్జి, ఏపీఎ కృష్ణంరాజు, ఈసీ రమేష్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

తొండంగి మండలంలోని పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాల విద్యార్థులు స్వచ్ఛ ఆంధ్రా-స్వర్ణ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎంవి.కె.మెహర్ ఆధ్వర్యంలో తీరప్రాంత గ్రామాల్లో విద్యార్థులు ర్యాలీ చేశారు.

గోకవరం ప్రభుత్వాస్పత్రిలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి కమిటీ సభ్యులు రాయవరపు శ్రీనివాసరావు, అల్లడ అరుణకుమారి, ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ వనజకుమారి, పంచాయతీ సెక్రటరీ శిరీష ఆధ్వర్యంలో ఆస్పత్రి ఆవరణను శుభ్రం చేసి మొక్కలు నాటారు. మెడికల్ వ్యర్థాలను తొలగించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు.